సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

బుధవారం | 6 | నవంబర్ | 2024



డిగ్రీ కళాశాలలో చైన్ స్నాచింగ్
జనగామ డిగ్రీ కళాశాలలో లైబ్రరీ ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వర్తిస్తున్న ఉపేందర్‌పై గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసి బంగారు గొలుసు ఎత్తుకెళ్లారు. - 8లో▸



ఎన్‌ఎస్‌ఎస్‌కు నిధులు కరువు
కేయూ పరిధిలోని ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్లకు నిధులు విడుదల కాకపోవడంతో వలంటీర్ల సేవలు అంతంత మాత్రంగానే కొనసాగుతున్నాయి. - 8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం 30°/19°

జిల్లాలో ఉదయం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం వేళ కాస్త ఎండ ఉంటుంది. రాత్రి సమయంలో చలి ఎక్కువగా ఉండడతోపాటు పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

11న అప్రెంటిస్ షిప్ మేళా
హన్మకొండ అర్బన్: నగరంలోని ములుగు రోడ్డులో గల ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈనెల 11న ఐటీఐలో పాసైన అన్ని ట్రేడ్స్ అభ్యర్థులకు అప్రెంటిస్ షిప్ మేళా నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ జి.సక్రు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేళాలో పలు కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. ఐటీఐ పాసైన 28 ఏళ్లలోపు అభ్యర్థులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు apprenticeshipindia.gov.in/mela&registration వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకుని మేళాకు హాజరుకావాలని కోరారు. అభ్యర్థులు బయోడేటా ఫామ్, ఎస్సెస్సీ మెమో, ఐటీఐ మెమో/ఎన్‌టీసీ సర్టిఫికెట్లు, కుల ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు 2 వెంట తెచ్చుకోవాలని సూచించారు.

వైద్యారోగ్యశాఖలో భర్తీ పూర్తి



ఎంజీఎం: హనుమకొండ జిల్లా వైద్యారోగ్య శాఖ పరిధిలో జాతీయ ఆరోగ్య మిషన్ కింద వివిధ కేడర్లలో మంగళవారం అభ్యర్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి ఎంపిక చేసినట్లు డీఎంహెచ్‌ఓ అప్పయ్య తెలిపారు. ఫిబ్రవరి-24లో నోటిఫికేషన్‌కు సంబంధించి ఎంఎల్‌హెచ్‌పీ 4, స్టాఫ్ నర్సులు 15, టీబీ వైద్యాధికారి 1, ల్యాబ్ టెక్నీషియన్లు 5, పీపీఎం కో-ఆర్డినేటర్ 1, డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ 1, ఫార్మసిస్ట్ 1 పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసి నియామక పత్రాలు అందించినట్లు వివరించారు. కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ డీడీ శ్రీలత, జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి డాక్టర్ గౌతమ్ చౌహాన్, అడ్మినిస్ట్రేటివ్ అధికారి రాజేశ్‌కుమార్, సూపరింటెండెంట్ వేణు, సీనియర్ అసిస్టెంట్లు ఫాతిమా, మల్లారెడ్డి, నవీన్ పాల్గొన్నారు.

25లోగా ఇంటర్మీడియట్ పరీక్ష ఫీజు చెల్లించాలి
కాళోజీ సెంటర్: ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా వార్షిక పరీక్ష ఫీజును ఈనెల 25లోగా చెల్లించాలని వరంగల్ డీఐఈఓ శ్రీధర్ సుమన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో డిసెంబర్ 4 వరకు, రూ.500 అపరాధ రుసుముతో డిసెంబర్ 11 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ ఆర్ట్స్ విద్యార్థులు రూ.520 ఫీజు చెల్లించాలని, సైన్స్, ఒకేషనల్ విద్యార్థులు ప్రాక్టికల్స్‌కు రూ.230 అదనంగా చెల్లించాలని సూచించారు. అన్ని కళాశాలల ప్రిన్సిపాళ్లు బోర్డు ఆదేశాలను తప్పక అమలు చేయాలని పేర్కొన్నారు.

అకడమిక్ వాతావరణాన్ని సృష్టిద్దాం



కేయూ క్యాంపస్: యూనివర్సిటీలో మంచి అకడమిక్ వాతావరణాన్ని సృష్టిద్దామని కేయూ వీసీ ఆచార్య కె.ప్రతాప్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేయూలోని కమిటీ హాల్‌లో హిస్టరీ అండ్ టూరిజం మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కాకతీయ జర్నల్ ఆఫ్ హిస్టారికల్ రీసెర్చ్-18వ వాల్యూమ్‌ను ఆయన విడుదల చేశారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, సోషల్ సైన్స్ విభాగాల డీన్ ప్రొఫెసర్ టి.మనోహర్, విభాగాధిపతి చిలువేరు రాజ్‌కుమార్, విశ్రాంత ఆచార్యులు కె.విజయబాబు, అధ్యాపకులు ఎం.బ్రహ్మయ్య, కేవీఎస్ నరేందర్, ఎంకే సుమంత్, కె.నాగేశ్వర్‌రావు, బి.శ్రీధర్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో మూడో స్థానం



వరంగల్ స్పోర్ట్స్: ఈనెల 1 నుంచి 3వ తేదీ వరకు సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-19 ఎస్‌జీఎఫ్‌ఐ స్విమ్మింగ్ పోటీల్లో ఉమ్మడి వరంగల్ జిల్లా క్రీడాకారులు మూడో స్థానంలో నిలిచారు. ఓవరాల్‌గా 30 పాయింట్లు సాధించడంతో పాటు 7 పతకాలను కైవసం చేసుకున్నట్లు డీఎస్‌ఏ కోచ్ నవీన్‌కుమార్ తెలిపారు. పతకాలు సాధించిన వారిలో స్నావెసేలా 1 గోల్డ్, సిల్వర్, బ్రాంజ్, ఆర్యచంద్ర 1 బ్రాంజ్, ఆర్య చక్రధర్‌రావు 1 బ్రాంజ్, రాజేశ్ 1 బ్రాంజ్, రాకేశ్ 1 బ్రాంజ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. కాగా.. పతకాలు సాధించిన క్రీడాకారులను, కోచ్‌లను హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ ప్రత్యేకంగా అభినందించారు.







హనుమకొండ పబ్లిక్‌గార్డెన్‌లోని పుట్టలో పాలు పోసి పూజలు చేస్తున్న భక్తులు, వరంగల్ ఉర్సు నాగేంద్రస్వామి ఆలయంలో పుట్టలో పాలుపోసి మొక్కులు చెల్లించుకుంటున్న మహిళలు, బారులుదీరిన భక్తులు

నాగుల చవితి
నాగేంద్రుడికి పూజలు
నగరంలో భక్తులు మంగళవారం నాగుల చవితిని భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వరంగల్ శంభునిపేట ఉర్సు ప్రతాప్‌నగర్‌లోని శ్రీనాగేంద్రస్వామి దేవాలయం, హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లోని శివాలయం వద్ద ఉన్న పుట్టల్లో పాలు పోసి పూజలు చేశారు. నాగేంద్రస్వామికి క్షీరాభిషేకాలు చేశారు. కార్తీకమాసం సందర్భంగా మహిళలు రావిచెట్టు, జమ్మిచెట్ల వద్ద వేర్వేరుగా దీపాలు వెలిగించారు.

- సాక్షి ఫొటోగ్రాఫర్లు హన్మకొండ/వరంగల్

ఓరుగల్లుపై ఫోకస్



గ్రేటర్ వరంగల్ అభివృద్ధిపై హైదరాబాద్ ఎంసీహెచ్‌ఆర్‌డీలో జరిగిన సమీక్షలో జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎంపీ కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్ నాగరాజు, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కడియం శ్రీహరి, మేయర్ సుధారాణి, తదితరులు

హైదరాబాద్‌కు దీటుగా 'గ్రేటర్' అభివృద్ధికి ప్రణాళిక
- రాజధానిలో మంత్రులు, ఎమ్మెల్యేలు, కలెక్టర్ల భేటీ
- విజన్-2050తో మాస్టర్‌ప్లాన్
- మామునూరు ఎయిర్‌పోర్ట్‌కు మహర్దశ.. త్వరలోనే పనులు ప్రారంభం
- రాష్ట్ర రెవెన్యూశాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- నేడు హనుమకొండలో 'గ్రేటర్' ఎంపీ, ఎమ్మెల్యేలు, కలెక్టర్ల సమావేశం

సాక్షిప్రతినిధి, వరంగల్ :

చారిత్రక నేపథ్యం ఉన్న గ్రేటర్ వరంగల్ మహానగర అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. సీఎం రేవంత్ రెడ్డి, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర మంత్రులు తరచూ సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం హైదరాబాద్‌లోని ఎంసీహెచ్‌ఆర్‌డీలో గ్రేటర్ వరంగల్, వరంగల్, హనుమకొండ జిల్లాల అభివృద్ధి కార్యక్రమాలపై రాష్ట్ర రెవెన్యూ శాఖ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఆయా జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. వరంగల్ మహానగరం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా 2050 జనాభాను దృష్టిలో పెట్టుకొని రూపొందించిన మాస్టర్ ప్లాన్ తుది దశకు చేరుకుందని, త్వరలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా విడుదల చేస్తామని ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.



మాస్టర్‌ప్లాన్, ఇన్నర్, ఔటర్ రోడ్లపై చర్చ..
వరంగల్ నగర అభివృద్ధిపై సుదీర్ఘంగా సాగిన ఈ సమీక్ష సమావేశంలో నూతన మాస్టర్ ప్లాన్, వరంగల్ ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్, భద్రకాళి దేవాలయ అభివృద్ధి, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, మెగా టెక్స్‌టైల్ పార్క్, మామునూరు ఎయిర్‌పోర్ట్, ఎకో టూరిజం తదితర అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్ నగరానికి దీటుగా అభివృద్ధి పర్చాలన్న కృతనిశ్చయంతో వరంగల్ నగరంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న వరంగల్ మాస్టర్ ప్లాన్‌ను తమ ప్రభుత్వం కొలిక్కి తీసుకువచ్చిందన్నారు. ఇన్నర్ రింగ్ రోడ్, ఔటర్ రింగ్ రోడ్‌కు అవసరమైన భూసేకరణను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని అధికారులను ఆయన ఆదేశించారు. 41 కిలోమీటర్ల పరిధి ఉన్న వరంగల్ ఔటర్ రింగ్ రోడ్డును మూడు దశల్లో చేపట్టాలని, మొదటి దశలో 20 కిలోమీటర్లు, రెండో దశలో 11, మూడో దశలో 9 కిలోమీటర్లు చేపట్టాలని సమావేశంలో నిర్ణయించారు.

భద్రకాళిలో నేటినుంచే పూడికతీత...
హైదరాబాద్ మినహా రాష్ట్రంలో మరెక్కడా ఎయిర్‌పోర్ట్ లేదని, వరంగల్ జిల్లాలో ఎయిర్ పోర్ట్ ద్వారా మహర్దశ రాబోతోందని మంత్రి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. వీలైనంత త్వరగా పనులను ప్రారంభించి ఏడాదిలోపు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి అవసరమైన కార్యాచరణను రూపొందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. 382 ఎకరాల పరిధిలో ఉన్న చారిత్రాత్మకమైన భద్రకాళి చెరువులో పేరుకుపోయిన పూడికను తీయాలని, ఇందుకు సంబంధించిన పనులను బుధవారం నుంచే మొదలు పెట్టాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా చెరువును ఖాళీ చేయాలని అధికారులకు సూచించారు. భద్రకాళి చెరువు 40 శాతం గుర్రపుడెక్కతో నిండిపోయిందన్నారు. మెగా టెక్స్‌టైల్ పార్కులో ఏర్పాటు చేసిన కంపెనీలు తప్పనిసరిగా స్థానికులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేలా, నగరంలో అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి పొంగులేటి ఆదేశించారు. సమావేశంలో ఎంపీ కడియం కావ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, రేవూరి ప్రకాశ్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, కడియం శ్రీహరి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, సీఎం ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్‌రెడ్డి, ప్రభుత్వ కార్యదర్శులు దాన కిశోర్, హరిచందన, హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, డాక్టర్ సత్యశారద, తదితరులు పాల్గొన్నారు.

నేడు హనుమకొండలో కీలకభేటీ...
వరంగల్ నగర అభివృద్ధితోపాటు పలు అంశాలపై బుధవారం హనుమకొండ కలెక్టరేట్ సమావేశ మందిరంలో మరో కీలక భేటీ నిర్వహించనున్నారు. సోషియో ఎకనామిక్ సర్వే, భద్రకాళి మాడవీధుల నిర్మాణం తదితర అంశాలపై రెండు జిల్లాల ఎమ్మెల్యేలు, ఎంపీ, మేయర్, కలెక్టర్లు, ఇరు జిల్లాలకు చెందిన వివిధ శాఖల అధికారులు పాల్గొంటారు.

సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల ధర్నా



మాట్లాడుతున్న రిటైర్డ్ ఎంప్లాయీస్ సెల్ బీజేపీ రాష్ట్ర చైర్మన్ పులి సరోత్తమ్‌రెడ్డి

విద్యారణ్యపురి: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం టీపీయూఎస్(తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం) హనుమకొండ, వరంగల్ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ధర్మాగ్రహ దీక్ష శిబిరం, ధర్నా నిర్వహించారు. హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద నిర్వహించిన ధర్నాలో ఆ సంఘం హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బత్తిని వీరస్వామి మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందన్నారు. ఈనెల 23న చలో ఇందిరా పార్క్ వద్ద జరగబోయే రాష్ట్రస్థాయి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రిటైర్డ్ ఎంప్లాయీస్ సెల్ బీజేపీ రాష్ట్ర చైర్మన్ పులి సరోత్తమ్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారంలోకి వచ్చి పదినెలలు గడిచినా కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క అంశాన్ని కూడా పరిష్కరించలేదన్నారు. వెంటనే పీఆర్సీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ధర్నాలో టీపీయూఎస్ నాయకులు బత్తిని వెంకటరమణగౌడ్, ఉప్పుల సతీశ్, మునికుంట్ల సంగెం శ్రీనివాస్, బాలాజీరావు మాట్లాడారు. ఈ శిబిరానికి బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, బీజేపీ నాయకులు రాణా ప్రతాప్, బలరాం, పీఆర్టీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు చీకటి సమ్మయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు పురుషోత్తమ్‌రెడ్డి, వీరేశలింగం సంఘీభావం తెలిపారు. ధర్నా అనంతరం టీపీయూఎస్ నాయకులు హనుమకొండ, వరంగల్ కలెక్టర్ల కార్యాలయాల్లో అధికారులకు వినతి పత్రాలు సమర్పించారు.

ఆదమరిచారో.. అంతే సంగతులు!



మూతలేని మ్యాన్‌హోల్‌పై పెద్ద పైపు ఉన్న ఈ ఫొటో వరంగల్ ఎల్లంబజార్ సెంటర్‌లోనిది. వాహనదారులు, పాదచారులు గమనించకుండా వచ్చి ఆ మ్యాన్‌హోల్‌లో పడిపోతున్నారు. దీంతో స్థానికులు ముందస్తు జాగ్రత్తగా దానిపై పెద్ద పైపును ఉంచారు. పలుమార్లు ఫిర్యాదు చేసినా బల్దియా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రాణనష్టం జరిగితే ఎవరు బాధ్యులవుతారని ప్రశ్నిస్తున్నారు. - సాక్షి వరంగల్

ఎస్సీ, ఎస్టీ కేసుల్లో న్యాయం చేస్తాం
హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

హన్మకొండ అర్బన్: జిల్లా పరిధిలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసుల్లో బాధితులకు చట్ట ప్రకారం న్యాయం జరిగేలా కృషి చేస్తామని హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా జిల్లాలో ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు వివరాలు, పురోగతి, తీసుకోవాల్సిన చర్యలు, తదితర అంశాలపై కమిటీ సభ్యులు, పోలీస్, రెవెన్యూ అధికారులతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రతీ మూడు నెలలకోసారి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. చర్చించిన అన్ని అంశాలు, సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు పుట్ట రవి, రాజేందర్, హరి జవహర్‌లాల్ నాయక్, పరంజ్యోతి, సింగారపు రవిప్రసాద్, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి పల్లెపాడు దామోదర్, ఓయాసిస్ సంస్థ ప్రతినిధి ప్రకాశ్, హనుమకొండ, పరకాల ఆర్డీఓలు రాథోడ్ రమేశ్, నారాయణ, ఏసీపీలు కిషోర్‌కుమార్, తిరుమల్, దేవేందర్‌రెడ్డి, ఎస్సీ సంక్షేమాధికారి శ్రీలత, తహసీల్దార్లు జ్యోతి వరలక్ష్మీదేవి, భావుసింగ్, ప్రసాద్, సదానందం, జగన్‌మోహన్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి నగరంలో సమగ్ర సర్వే
- 2,90,969 గృహాలు, 1,674 మంది ఎన్యుమరేటర్
- 168 మంది సూపర్‌వైజర్లు సన్నద్ధం
- కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: వరంగల్ మహా నగర వ్యాప్తంగా బుధవారం(నేటి) నుంచి సమగ్ర సర్వే నిర్వహించనున్నట్లు బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బల్దియా వ్యాప్తంగా 66 డివిజన్లలో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల అంశాల్లో సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నగర పరిధిలో మొత్తం 2,90,969 గృహాలున్నాయని, 1,674 ఎన్యుమరేటర్లు, 168 మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నగర వ్యాప్తంగా సమగ్ర సర్వే కోసం ఎన్యుమనేటర్లు, సూపర్‌వైజర్లకు ఇప్పటికే శిక్షణ ఇచ్చి, సిద్ధం చేసినట్లు పేర్కొన్నారు. సర్వే కోసం రూపొందించిన 75 ప్రశ్నలతో కూడిన ప్రశ్నావళిని రెండు పార్టులుగా విభజించి ఎన్యుమరేటర్లు సర్వే నిర్వహిస్తారని తెలిపారు. ప్రతి ఎన్యుమరేటర్ 90 నుంచి 175 గృహాల్లో సర్వే చేస్తారని పేర్కొన్నారు. ఎన్యుమరేటర్ ప్రతి రోజూ 10 గృహాల్లో సర్వే నిర్వహించాల్సి ఉంటుందని, సర్వే సులభతరం చేయడానికి వీలుగా వారికి కేటాయించిన గృహాలను బ్లాకులుగా విభజించి నిర్వహిస్తారని తెలిపారు. గృహాల గుర్తింపునకు స్టిక్కర్ల అందజేతతో పాటు సర్వే నిర్వహణ గృహాలకు సంబంధించిన జాబితాతో పాటు స్టేషనరీ సంబంధ మెటీరియల్‌ను అందజేసినట్లు వివరించారు. తొలి దఫాలో భాగంగా ఈనెల 6 నుంచి 8వ తేదీ వరకు గృహాలకు స్టిక్కరింగ్ చేసి గృహాల గుర్తింపు ప్రక్రియ చేపడుతారని, 9వ తేదీ నుంచి వాస్తవ సర్వే మొదలవుతుందని పేర్కొన్నారు. సర్వే చేసే ఎన్యుమరేటర్లకు ప్రశ్నావళి బుక్‌లెట్లు అందజేసినట్లు గృహాలకు వచ్చే సిబ్బందికి నగర ప్రజలు సమగ్ర సమాచారం అందించి సహకరించాలని కమిషనర్ కోరారు.

భద్రకాళి ఆలయానికి భారత ప్రభుత్వ గుర్తింపు
హన్మకొండ కల్చరల్: భద్రకాళి దేవస్థానానికి భారత ప్రభుత్వ ఆహార పరిరక్షణ ప్రమాణాల అధికారిక సంస్థ ఈట్ రైట్ ప్లేస్ ఆఫ్ వర్షిప్ సర్టిఫికెట్ (భోగ్)ను అందజేసింది. మంగళవారం హైదరాబాద్ సంజీవరెడ్డి నగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యామిలీ హెల్త్ అండ్ వెల్ఫేర్ ఇన్‌స్టిట్యూట్‌లో జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మాత్యులు దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఆలయ ఈఓ, అసిస్టెంట్ కమిషనర్ శేషుభారతికి ఈట్ రైట్ ప్లేస్ ఆఫ్ వర్షిప్ సర్టిఫికెట్ అందజేశారు.



సర్టిఫికెట్ అందుకుంటున్న ఈఓ శేషుభారతి

నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం?
- హనుమకొండ వైద్యారోగ్యశాఖలో కాంట్రాక్టు ఉద్యోగి లీలలు
- ఆడిట్‌లో సొంత ఖాతాలోకి ప్రభుత్వ డబ్బులు
- లక్షల రూపాయలు మింగేశారంటూ ఆరోపణలు
- విచారణ చేస్తాం: డీఎంహెచ్‌ఓ డాక్టర్ అప్పయ్య



ఎంజీఎం : హనుమకొండ వైద్యారోగ్యశాఖలోని నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఓ కీలక అధికారి నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందడంతోపాటు లక్షల రూపాయలు మింగేశాడన్న వార్త కలకలం రేపుతోంది. కొన్ని నెలల క్రితం జరిగిన ఆడిటింగ్‌లో అధికారులు ఈవిషయాన్ని గుర్తించినట్లు తెలుస్తోంది. వైద్యారోగ్య శాఖలో కేంద్రప్రభుత్వ నిధులతో నేషనల్ హెల్త్ స్కీం(జాతీయ ఆరోగ్య పథకం) ద్వారా ప్రజలకు చాలా సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు. ఈ పథకాల నిర్వహణకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చిస్తోంది. ప్రోగ్రాం అధికారితోపాటు సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మినిస్ట్రీరియల్ స్టాఫ్‌ను కాంట్రాక్ట్ పద్ధతిలో నియమించి ఓ విభాగం ద్వారా నిత్యం కార్యక్రమాలను జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి పర్యవేక్షిస్తుంటారు. ఈవిభాగంలోని ఉద్యోగుల నియామకాలు, నిధుల ఖర్చు వివరాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎప్పటికప్పుడు ఆడిటింగ్ సైతం నిర్వహిస్తాయి. కొన్ని నెలల క్రితం నిర్వహించిన ఆడిటింగ్‌లో చాలా కీలకమైన విషయాలను అధికారులు గుర్తించినట్లు సమాచారం. ఓ అధికారికి సంబంధించి చాలా విషయాలు తెలిసినట్లు ఆ శాఖ ఉద్యోగులు చెబుతున్నారు.

నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందాడని ఆరోపణలు..
ప్రస్తుతం హనుమకొండ జిల్లా వైద్యారోగ్యశాఖలో నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఓ కీలక అధికారి నకిలీ సర్టిఫికెట్‌తో ఉద్యోగం పొందినట్లు తెలుస్తోంది. సదరు అధికారి సర్టిఫికెట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో కాకుండా హైదరాబాద్ కమిషనర్ కార్యాలయంలో ఉండడంవల్ల చాలామంది వాటి ధ్రువీకరణపై ఆర్టీఐ ద్వారా సమాచారం అడగడంతో కమిషనర్ కార్యాలయంలో ఉంటాయని పేర్కొంటూ వివరాలు ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు. దీంతో కమిషనర్ కార్యాలయంలో కూడా సదరు ఉద్యోగిపై ఆర్టీఐ దరఖాస్తులు సమర్పించినట్లు తెలిసింది.

ప్రభుత్వ నిధులు సొంత ఖాతాలోకి..
నేషనల్ హెల్త్ మిషన్‌లో పలు పథకాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా నిధులు కేటాయిస్తారు. ఈ నిధులు ప్రభుత్వ ఖాతాలోకి వెళ్లి.. ఎవరైతే ఆ నిధులు పొందుతారో వారి ఖాతాలోకి వెళ్లాలి. కానీ, ఈ నిధులు సదరు అధికారి సొంత ఖాతాలోకి వెళ్లిన విషయాన్ని ఆడిటింగ్ అధికారులు గుర్తించినట్లు తెలుస్తోంది. పల్లె దవాఖాన వైద్యుల శిక్షణ కోసం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.5.32లక్షలతో పాటు, ఐఈసీ మెటీరియల్‌కు సంబంధించిన రూ.35 లక్షలకుపైగా నిధులు సొంత ఖాతాలోకి జమ చేసి దుర్వినియోగం చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆయుష్ భవన నిర్మాణాల కోసం రూ.60 లక్షలు మంజూరయ్యాయని, ఆ నిధుల్లోనూ గోల్‌మాల్ జరిగినట్లు సమాచారం. ఈ నిధులేమయ్యాయో తెలియని పరిస్థితి.

విచారణ చేపడతాం..
కొన్ని రోజుల క్రితం డీఎంహెచ్‌ఓగా బాధ్యతలు స్వీకరించా. ఇప్పటివరకు నేషనల్ హెల్త్ మిషన్ ఆర్థిక కార్యకలాపాలపై దృష్టి సారించలేదు. సొంత ఖాతాలోకి నిధులు వెళ్లాయనే ఆరోపణలపై విచారణ చేపడతాం. నకిలీ సర్టిఫికెట్ల విషయాన్ని కూడా పరిశీలిస్తాం. వాటిని ధ్రువీకరించి నకిలీ అని తేలితే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

– అప్పయ్య, డీఎంహెచ్‌ఓ

టెక్నోజియాన్-24 టీజర్ విడుదల
కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని టైమ్ స్క్వేర్ ప్లాజా ఆవరణలో మంగళవారం టెక్నోజియాన్-24 మూడున్నర నిమిషాల వీడియోతో కూడిన టీజర్‌ను నిట్ డైరెక్టర్ బిద్యాధర్ సుబుదీ విడుదల చేశారు. ఈనెల 8, 9, 10 తేదీల్లో టెక్నోజియాన్-24ను నిర్వహించనున్నట్లు నిట్ డైరెక్టర్ తెలిపారు. విద్యార్థులే నిర్వాహకులుగా ప్రతీ ఏడాది నిర్వహించే టెక్నోజియాన్‌ను ఈ ఏడాది మూడు రోజుల పాటు 58 ఈవెంట్లతో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. టీజర్ విడుదల సందర్భంగా విద్యార్థులు బాణసంచా పేల్చి, ఆటపాటలతో సంబురాలు జరుపుకున్నారు.

గ్రామీణ ప్రాంతంలో సైక్లింగ్ క్రీడకు ప్రోత్సాహం

- రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయకాంతారావు



పోటీలను ప్రారంభిస్తున్న ఏసీపీ పార్థసారథి

లింగాలఘణపురం: గ్రామీణ ప్రాంతాల్లో సైక్లింగ్ క్రీడను ప్రోత్సహించడానికే మొదటిసారిగా జనగామ జిల్లా లింగాలఘణపురం మండలంలో 9వ అంతర్ జిల్లా రోడ్ సైక్లింగ్ చాంపియన్ షిప్ పోటీలను నిర్వహించినట్లు రాష్ట్ర సైక్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి విజయకాంతారావు తెలిపారు. మంగళవారం 9వ అంతర్ జిల్లా సైక్లింగ్ చాంపియన్ షిప్ పోటీలను జనగామ ఏసీపీ పార్థసారథితో కలిసి ప్రారంభించారు. లింగాలఘణపురం దుర్గమ్మ గుడి నుంచి నెల్లుట్ల వరకు 5కి.మీ మేర ఈ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సైక్లింగ్ క్రీడ అంతగా తెలియదని, ఇలాంటి క్రీడపై యువతలో ఆసక్తి కలిగించేందుకు జనగామ జిల్లాలో అంతర్ జిల్లా పోటీలను ప్రారంభించడం అభినందనీయమని అన్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ పోటీల్లో రాష్ట్రంలోని 22 జిల్లాల నుంచి 382 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని, మొదటి రోజు అండర్ 14, బాలబాలికలకు 5 కి.మీ పోటీలతోపాటు 18 ఏళ్ల యువకులకు పోటీలు నిర్వహించడం జరిగిందని నిర్వాహకులు కిషన్ తెలిపారు. వరంగల్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కైలాస్‌యాదవ్, జనగామ జిల్లా సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుమార్‌గౌడ్, ఎస్సై శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

సకాలంలో సిలబస్ పూర్తిచేయాలి

- వరంగల్ డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్

కాశీబుగ్గ సెంటర్: సకాలంలో సిలబస్ పూర్తిచేయడానికి జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు కృషి చేయాలని వరంగల్ డీఐఈఓ డాక్టర్ శ్రీధర్ సుమన్ సూచించారు. వరంగల్‌లోని పలు కళాశాలలను మంగళవారం ఆయన సందర్శించి బోధనపై పలు సూచనలిచ్చారు. ఈ సందర్భంగా డీఐఈఓ మాట్లాడుతూ విద్యార్థులు తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. హాజరు శాతం పెంపు కోసం అధ్యాపకులు కృషిచేయాలని, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా బోధనను మెరుగుపరుచుకోవాలని సూచించారు. డీఐఈఓ వెంట ఆఫీస్ సిబ్బంది రాజశేఖర్, కొలంబో ఉన్నారు.

ఆరోగ్య జిల్లాగా మార్చాలి

- వరంగల్ డీఎంహెచ్ఓ సాంబశివరావు



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ సాంబశివరావు

ఖిలా వరంగల్: వైద్య అధికారులు, ఆశ కార్యకర్తలు సమన్వయంతో వైద్య సేవలందించి వరంగల్‌ను ఆరోగ్యగా జిల్లాగా మార్చేందుకు కృషిచేయాలని వరంగల్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి సాంబశివరావు సూచించారు. ఉద్యోగ ధర్మాన్ని పాటించి, విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా సేవలందించాలని ఆయన కోరారు. వరంగల్ రంగశాయిపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని సూచించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ మోహన్‌సింగ్ మాట్లాడుతూ సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు, మాతాశిశు సంరక్షణ సేవలందించాలని చెప్పారు. వైద్యులు రమ్య, వంశీకృష్ణ, అనిల్ కుమార్, జ్ఞాన సుందరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


రెడ్డి చికెన్ సెంటర్
Cell: 9989299661

ఎన్ఎస్ఎస్‌కు నిధులు కరువు

కేయూ పరిధిలో 356 ఎన్ఎస్ఎస్ యూనిట్లు

- రావాల్సిన నిధులు రూ 2.67కోట్లు
- ఇటీవల రూ.20లక్షలే విడుదల
- కానరాని ప్రత్యేక శిబిరాలు.. యువజనోత్సవాలు
- మైభారత్ పోర్టల్‌లోనూ సమస్యే..

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, అదిలాబాద్ జిల్లాల్లో విస్తరించి ఉన్న జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) వలంటీర్ల సామాజిక సేవా కార్యక్రమాలతో రాష్ట్రపతి అవార్డు అందుకున్న ఘనత ఉంది. కానీ, రెండేళ్లుగా పూర్తిస్థాయిలో నిధులు విడుదల కాకపోవడంతో ఎన్ఎస్ఎస్ వలంటీర్ల సేవలు అంతంత మాత్రంగానే అందించే పరిస్థితి నెలకొంది.



మార్కెట్ పరిసరాలను శుభ్రంచేస్తున్న హనుమకొండలో కేడీసీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు (ఫైల్)

రూ.20లక్షలే విడుదల

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో 11 జిల్లాల్లో ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ అండ్ పీజీ కళాశాలలు కలిపి 356 ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఉన్నాయి. ఒక్కో యూనిట్‌కు 100 మంది చొప్పున మొత్తంగా 35,600 ఎన్ఎస్ఎస్ వలంటీర్లున్నారు. గతంలో క్లీన్ అండ్ గ్రీన్, శ్రమదానం, మొక్కలు నాటడం, సామాజిక రుగ్మతలపై చైతన్యం రక్తదాన శిబిరాలు నిర్వహించేవారు. కేంద్ర క్రీడల, యువజన మంత్రిత్వశాఖ ఆదేశాలమేరకు హైదరాబాద్‌లోని ఎన్ఎస్ఎస్ రీజినల్ డైరెక్టరేట్ ఆదేశాల మేరకు కేంద్రప్రభుత్వం నిధులతో ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు కొనసాగేవి. ఎన్ఎస్ఎస్ సేవల్లో ప్రధానంగా స్వచ్ఛభారత్, స్వచ్ఛతా హీ సేవా, మేరాదేశ్ మేరామట్టి, స్వాభిమాన్ స్వచ్ఛత, స్వభావ్ స్వచ్ఛత, రాష్ట్రీయ ఏక్తా దివస్, రాష్ట్రీయ సమ్విదాన్ దివస్, ఏక్‌భారత్ శ్రేష్ఠ భారత్ దివాళి విత్ మైభారత్ తదితర చైతన్య కార్యక్రమాలతోపాటుగా రక్తదాన శిబిరాలను నిర్వహిస్తున్నారు. డిజిటల్ ఇండియా ,డిజిటల్ లిటరసీ పై కూడా కార్యక్రమాలు చేపట్టాలనే కేంద్ర ప్రభుత్వ ఆదేశాలున్నాయి. వీటి నిర్వహణ సందర్భంగా ఆయా ఆ వలంటీర్లకు స్నాక్స్, బ్యానర్లు, సమావేశాల నిర్వహణకు నిధులు అవసరం ఉంటుంది. ఒక యూనిట్‌కు రూ.27,500, అదేవిధంగా ఏదైనా గ్రామంలో యూనిట్ వారం రోజులపాటు ప్రత్యేక శిబిరం 50 మంది వలంటీర్లతో ఏర్పాటుచేస్తే రూ.35వేలు ఇస్తారు. ఈ విద్యాసంవత్సరం ప్రారంభమై నవంబర్ నెల వచ్చినా ఎన్ఎస్ఎస్ యూనిట్లకు నిధులు ఇవ్వకపోవటంతో కార్యక్రమాలు సాగడంలేదు. కొందరు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు సొంతఖర్చులతో సేవా కార్యక్రమాలు నిర్వహించి నిధుల విడుదల కోసం వేచిఉన్నారు. కేంద్ర ప్రభుత్వం కాకతీయ యూనివర్సిటీకి ఈవిద్యాసంవత్సరానికిగాను రూ.2.67 కోట్లు విడుదల చేయాల్సిండగా అక్టోబర్‌లో కేవలం రూ.20 లక్షలే విడుదల చేసింది. అయితే తక్కువ నిధులు కావడంతో కేయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ వాటిని ఏ యూనిట్‌కు విడుదల చేయలేదు. కాగా.. ఈనిధుల విడుదల, వినియోగానికి వీసీ అప్రూవల్ కూడా తీసుకోవాల్సి ఉంటుంది. ఇదిలా ఉండగా, ఈ విద్యాసంవత్సరం ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలకు సంబంధించి కేయూ ఎన్ఎస్ఎస్ అడ్వయిజరీ కమిటీ మీటింగ్, ఉమ్మడి జిల్లాస్థాయిలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశం నిర్వహించకపోవడం గమనార్హం.

మైభారత్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్

కేంద్ర ప్రభుత్వం ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల నిర్వహణకు సంబంధించి మైభారత్ పోర్టల్‌ను తీసుకొచ్చింది. ఇందులో కళాశాలల పేర్లు, వలంటీర్ల వివరాలు రిజిస్ట్రేషన్ చేయాలి. ఈ పోర్టల్‌లో ప్రతి కాలేజీ లాగిన్ అయి నూతన వలంటీర్లు, కోఆర్డినేటర్ల వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది. ప్రత్యేక శిబిరాలు నిర్వహించాలనుకుంటే ఈ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి. ప్రత్యేక శిబిరం ఎక్కడ నిర్వహించేది.. ఏఏ కార్యక్రమాలు చేసేది కూడా అప్‌లోడ్ చేసి యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్‌కు ప్రతిపాదించి అనుమతి పొందాకే శిబిరాలు నిర్వహించాలి. అయితే మైభారత్ పోర్టల్‌లో కొన్ని జూనియర్ కళాశాలల పేర్లు చూపటంలేదు. దీంతో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు తమ వలంటీర్ల వివరాలు నమోదు చేయలేకపోతున్నారు. పలు కళాశాలల ప్రోగ్రాం ఆఫీసర్లు ఈ సమస్యపై సంబంధిత అధికారులకు వివరించినా.. సమస్య పరిష్కారం కాలేదు.

ఊసేలేని ప్రత్యేక శిబిరాలు..

గ్రామీణ ప్రాంతాల్లో కళాశాలల ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఒక్కో యూనిట్ ఒక ప్రత్యేక శిబిరాన్ని నిర్వహించుకునే వీలుంటుంది. కానీ ఈ విద్యాసంవత్సరంలో యూనివర్సిటీ పరిధిలో ఒక్క ప్రత్యేక శిబిరం కూడా నిర్వహించలేదు. వలంటీర్లు గ్రామాల్లోకి వెళ్లి సామాజిక రుగ్మతలపై చైతన్యం కలిగించడం, దసరా, దీపావళి సందర్భాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహించాల్సి ఉంటుంది. ప్రోగ్రాం ఆఫీసర్లు సొంతంగా ఖర్చు చేసి ప్రత్యేకశిబిరాలు నిర్వహించుకొని నిధులు మంజూరైన తర్వాత బిల్లులు పెట్టుకునేవారు. కానీ, గత సంవత్సరం నుంచి కేంద్ర ప్రభుత్వం ఇందులో పలు మార్పులు తీసుకొచ్చింది. దీంతో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు అంతగా ఆసక్తికనపర్చడంలేదు.

త్వరలో అడ్వయిజరీ కమిటీ సమావేశం



కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల అడ్వయిజరీ కమిటీ సమావేశం వారం రోజుల్లో నిర్వహిస్తాం. ఈ విద్యాసంవత్సరానికి ఆలస్యంగా కేవలం అక్టోబర్ రూ.20 లక్షలే కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది. ఎన్ఎస్ఎస్‌కు సంబంధించిన సమస్యలను వీసీ దృష్టికి తీసుకెళ్తాను. ఉమ్మడిజిల్లాల వారీగా ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ల సమావేశం కూడా నిర్వహిస్తాం. మైభారత్ పోర్టల్‌లో వలంటీర్లు, ప్రోగ్రాం ఆఫీసర్ల వివరాలు నమోదైతేనే నిధులు విడుదల అవుతాయి.

– ప్రొఫెసర్ ఈసం నారాయణ, కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్

కానరాని యువజనోత్సవాలు..

విద్యార్థులు చదువుతోపాటు ఎన్ఎస్ఎస్ వలంటీర్లుగా సామాజిక సేవలు అందించటంతోపాటు తమలోని సృజనాత్మకత, సాంస్కృతిక ప్రతిభను వెలికి తీసుకొనేందుకు అవకాశం కల్పించాలి. ఇందుకు ఉమ్మడి జిల్లాస్థాయి, యూనివర్సిటీ స్థాయిలోనూ యువజనోత్సవాలు నిర్వహించాల్సి ఉంటుంది. కానీ, గత రెండేళ్లుగా నిధుల లేమితో యువజనోత్సవాలు నిర్వహించడంలేదు.

రెమ్యునరేషన్ చెల్లించడంలేదు

కాకతీయ యూనివర్సిటీ పరిధిలో 356 మంది ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఉన్నారు. ఒక్కో ప్రోగ్రాం ఆఫీసర్‌కు రూ.8,500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. వీరికి మూడేళ్లుగా రెమ్యునరేషన్ ఇవ్వకపోవంతో కార్యక్రమాల నిర్వహణపై అనాసక్తితో ఉన్నారు. ఎన్ఎస్ఎస్‌పై ఆసక్తి ఉన్న ఆఫీసర్లు పలువురు సొంతఖర్చులతో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. నిధులు విడుదల చేయకుండా ఉంటే రాబోయే కాలంలో ఎన్ఎస్ఎస్ యూనిట్లు తగ్గిపోయే అవకాశాలు లేకపోలేదు.

ఎన్పీడీసీఎల్‌లో క్రీడలకు పెద్దపీట

- సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి



ట్రోఫీని అందజేస్తున్న వరుణ్‌రెడ్డి

హన్మకొండ : టీజీఎన్పీడీసీఎల్ క్రీడలకు ఎల్లప్పుడూ పెద్దపీట వేస్తుందని చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రంలోని ట్రాన్స్, డిస్కమ్స్‌లోని అన్ని సర్కిల్ పరిధిలో నిర్వహించిన టోర్నమెంట్‌లో అత్యధిక పాయింట్లు సాధించిన వరంగల్ సర్కిల్‌కు సీఎండీ వరుణ్‌రెడ్డి చైర్మన్ ట్రోఫీని అందజేశారు. 2023–24 సంవత్సరానికి జరిగిన పోటీల్లో ఉమ్మడి వరంగల్ సర్కిల్ అగ్రస్థానంలో నిలిచింది. ఉమ్మడి వరంగల్ స్పోర్ట్స్ కౌన్సిల్ చైర్మన్ వెంకటరమణ సీఎండీ చేతుల మీదుగా ట్రోఫీని అందుకున్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ కౌన్సిల్ కన్వీనర్ విజేందర్‌రెడ్డి, కోశాధికారి సంతోశ్, ఇన్‌చార్జ్ డైరెక్టర్ మధుసూదన్, ఎస్ఈలు మధుసూదన్, నరేశ్‌కుమార్, వేణుమాధవ్, స్పోర్ట్స్ కమిటీ సభ్యులు యాకూబ్‌పాషా, సునీల్‌కుమార్, ప్రేమ్‌కుమార్, ఎస్ఏఓ నవీన్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

హన్మకొండ అర్బన్: ఉమ్మడి వరంగల్ జిల్లాలోని నిరుద్యోగ యువతి, యువకులకు ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఈనెల 7న (గురువారం) జాబ్ మేళా నిర్వహించనున్నట్లు హనుమకొండ జిల్లా ఉపాధి కల్పన అధికారి మల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లోని మాళవికా డెవెలపర్స్ కంపెనీలో 50 మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఈ ఎంపికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారై ఎస్సెస్సీ, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసినవారు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు గురువారం ములుగు రోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ క్యాంపస్‌లోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఉదయం 11 గంటలకు నిర్వహించే మేళాకు హాజరుకావాలని తెలిపారు. రెస్యూమ్, విద్యార్హత సర్టిఫికేట్స్ జిరాక్స్ కాపీలతో రావాలని, సందేహాల నివృత్తికి 78933 94393 ఫోన్ నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

ముగిసిన 68వ రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు



నెల్లికుదురు కత్తిసాము క్రీడల్లో పోటీపడుతున్న బాలికలు



క్రీడాకారులతో అధికారులు, నిర్వాహకులు

- 120 మంది క్రీడాకారులకు పతకాలు

నెల్లికుదురు: రెండు రోజులుగా మండల కేంద్రంలోని ప్రభుత్వం జూనియర్ కళాశాల, జెడ్పీహెచ్ఎస్ ఆవరణలో హోరాహోరీగా జరిగిన అండర్ –14, 17, 19 విభాగం 68వ రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు మంగళవారం ముగిసినట్లు ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి జి.సత్యనారాయణ గౌడ్ తెలిపారు. ఈ క్రీడలు 100 మంది టెక్నీషియన్స్, అధికారుల పర్యవేక్షణలో రాష్ట్రంలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి వచ్చిన 600 మంది క్రీడాకారులు మూడు విభాగాలుగా ఆర్చరీ, కత్తిసాము పోటీలో పాల్గొన్నట్లు తెలిపారు. ఆర్చరీ, కత్తిసాము క్రీడల్లో మూడు విభాగాల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చిన 120 మంది జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. 120 మందికి క్రీడాకారులకు బంగారు, సిల్వర్ పతకాలు ఎస్సై చిర్ర రమేశ్‌బాబు, ఎంఈఓ రాందాస్ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు చెడుపల్లి అయిలయ్య, అధికారులు, పరిశీలకులు పాల్గొన్నారు.

సర్వేలో ఆరె కులం అని రాయించాలి




సమావేశంలో మాట్లాడుతున్న నాగుర్ల వెంకటేశ్వర్లు

- ఆరె సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు

హన్మకొండ : బీసీ జనగణన, సమగ్ర కుటుంబ సర్వేలో ఆరె కులస్తులంతా సర్వేలో ఆరె కులమని స్పష్టంగా రాయించాలని ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లు సూచించారు. హనుమకొండ ఇందిరానగర్‌లో మంగళవారం నిర్వహించిన ఆరె కుల సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా ముఖ్య నాయకుల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడారు. 6వ తేదీ నుంచి బీసీ కులగణన చేపడుతున్నారని అన్నారు. ఆరె కులస్తులందరూ జనగణన, కులగణనలో పాల్గొన్నాలని తెలిపారు. ఆరె కులం బీసీ(డీ)– 34 అని గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఈ గణన ఓబీసీకి సంబంధించింది కాదని, స్థానిక సంస్థల ఎన్నికల కోసమే చేస్తున్నారన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల ఖరారుకు ప్రామాణికంగా తీసుకోనున్నారని తెలిపారు. ఆరె కులస్తులు ఈ విషయంలో జాగ్రత్తగా ఉండి కులం పేరును ఖచ్చితంగా రాయించాలని చెప్పారు. సమావేశంలో ఆరె సంక్షేమ సంఘం నాయకులు నాగుర్ల శంకర్‌రావు, వలిగె సాంబారావు, లాండిగ లక్ష్మణ్‌రావు, జగన్మోహన్‌రావు, గుండెకారి రంగారావు, సుధాకర్, ఇంగె శివాజీ, వంచనగిరి వీరేశం, కిషన్‌రావు, మనోహర్‌రావు, బాబురావు, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించడమే లక్ష్యం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న రాజేశ్‌కుమార్

ఖిలా వరంగల్/వరంగల్ చౌరస్తా: ఎస్‌బీఐ ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తూ రైతులకు రుణాలు, చిరువ్యాపారులకు ముద్ర రుణాలు అందజేస్తామని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ సర్కిల్ చీఫ్ జనరల్ మేనేజర్ రాజేశ్‌కుమార్ తెలిపారు. వరంగల్ ఫోర్ట్ రోడ్డులోని హనుమాన్ జంక్షన్, కాకతీయ విశ్వవిద్యాలయం బ్రాంచ్‌ను మల్లికార్జున రెడ్డి మంగళవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఖాతాదారుల ప్రయోజనం, బ్యాంకింగ్ సేవలు, పరిష్కారాల్లో ఎస్‌బీఐ ముందంజలో ఉంటుందన్నారు. డిపాజిట్ ఖాతాలను తెరవడం, అన్ని రకాల రుణాలను అందించడం, డిజిటల్ బ్యాంకింగ్ సొల్యూషన్స్ ప్లాట్ ఫామ్(యోనో) వంటి అనేక బ్యాంకింగ్ ఉత్పత్తులు, సేవలను అందించడం ద్వారా పౌరుల బ్యాంకింగ్ అవసరాలను తీర్చడానికి కొత్త శాఖ కట్టుబడి ఉంటుందన్నారు. సైబర్ నేరాల కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నంబర్ 1930 ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మేనేజర్ సునిత, కార్పొరేటర్ బైరబోయిన ఉమ, ప్రకాశ్‌చంద్ర బరోర్, సంజయ్‌కుమార్‌ఝూ, సునిల్ కుమార్ గోయల్, ఘన్‌శ్యామ్ సోలంకి, విష్ణువర్ధన్, అబ్దుల్ రహీమ్ షేక్, శంకర్, అంజనేయప్రసాద్, మహేందర్, సంతోశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

హన్మకొండ : యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా కందిలో అధిక దిగుబడి సాధించవచ్చని వరంగల్ ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ ఉమారెడ్డి అన్నారు. వరంగల్ పైడిపల్లిలోని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో కంది పూత సమయంలో తెగుళ్ల ప్రబలకుండా ఉండేందుకు డ్రోన్ల ద్వారా మందు పిచికారీ చేసే విధానంపై మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమారెడ్డి మాట్లాడుతూ.. పూతదశలో కాయ తొల్చు పురుగులైన శెనగపచ్చ పురుగు, మారుక పూతగూడు పురుగుల నివారణకు హిమామెక్టిన్, బెంజోయెట్ 0.4 గ్రాములు, వేప నూనె 1,500 డీపీఎం, 5 మి.లీ నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలని సూచించారు. అనంతరం ప్రథమ శ్రేణి పరీక్షలకు విత్తనం తీసుకొని పంట పండిస్తున్న రైతులకు కీటక నాశినులైన వేపనూనె, కోరాంటనిల్‌ప్రోల్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో అపరాల విభాగం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎస్.సంధ్యా కిషోర్, ఎఫ్ఎల్‌డీ ఎం.మధు, శాస్త్రవేత్తలు ఎస్.ఓంప్రకాశ్, జి.పద్మజ, వీరన్న రైతులు పాల్గొన్నారు.



డ్రోన్ ద్వారా క్రిమిసంహారక మందు పిచికారీ విధానాన్ని రైతులకు చూపిస్తున్న శాస్త్రవేత్తలు

సేంద్రియ పద్ధతులు పాటించాలి

ఎల్కతుర్తి: పట్టు రైతులు మల్బరీ సాగులో సేంద్రియ పద్ధతి పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడి పొందవచ్చని జాయింట్ డైరెక్టర్ అనసూర్య అన్నారు. మండల కేంద్రం శివారులోని పట్టుపరిశ్రమ కార్యాలయంలో మంగళవారం పట్టుపరిశ్రమ శాఖ ఆధ్వర్యంలో వరంగల్ ఉమ్మడి జిల్లా పట్టు రైతులకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. పట్టు పురుగులకు నాణ్యమైన ఆకు వేయాలని, గాలి వచ్చిపోయో విధంగా షెడ్డులో ఎగ్జిట్ ఫ్యాన్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా ఇమ్యూనిటీ పవర్ కంట్రోల్ చేస్తుందని వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీలకు షెడ్డు నిర్మాణంపై అందజేస్తున్న సబ్సిడీలు వివరించారు. కార్యక్రమంలో జిల్లా హార్టీకల్చర్, సెరీకల్చర్ అధికారి వెంకటేశ్వర్‌రావు, సైంటీస్టులు వినోద్‌కుమార్, రాఘవేంద్ర, సెరీకల్చర్ మండల అధికారి సారంగపాణి, సంజీవరెడ్డి, ఏఎస్ఓలు రవీందర్, అరవింద్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జేడీ అనసూర్య

మొక్కజొన్న పంట సందర్శన

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త రాజన్నతో కలిసి కో ఆర్డినేటర్ డాక్టర్ రాజన్న మంగళవారం దత్తత గ్రామాలైన తిమ్మాపూర్, అల్లీపూర్ గ్రామాల్లో మొక్కజొన్న పంటలను సందర్శించారు. ఈసందర్భంగా మొక్కజొన్నలో కత్తెర పురుగు ఉధృతిని గమనించారు. పురుగు నివారణకు ఎకరానికి 5 లింగాకర్షక బుట్టలు అమర్చుకుని రెక్కల పురుగుల ఉధృతి గమనిస్తూ ఉండాలని సూచించారు. పంట తొలిదశలో గుడ్ల సముదాయాన్ని నాశనం చేయాలని తెలిపారు. వేప నూనె 1,500 పీపీఎం 5 మిల్లీ లీటర్లు.. లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, పురుగు ఉధృతి ఎక్కువగా ఉన్నప్పుడు ఎమమెక్టిన్ బాంజోయేట్ 0.4 మిల్లీ లీటర్లు, స్పినోటారమ్ 1 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలిపారు.

చైన్ స్నాచింగ్ ఘటనలో నిందితురాలి అరెస్ట్

హసన్‌పర్తి: చైన్ స్నాచింగ్ ఘటనలో నమోదైన కేసును పోలీసులు 24 గంటల్లో చేధించారు. నిందితురాలిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కాకతీయ యూనివర్సిటీ పోలీస్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని గోపాలపురం గణేశ్ నగర్‌కాలనీకి చెందిన ఎస్.లావణ్య –ప్రవీణ్ దంపతుల నాలుగేళ్ల కూతురు సోమవారం ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా, ఆమె మెడలో ఉన్న సుమారు 12 గ్రాముల బంగారు గొలుసు మాయమైంది. ఈమేరకు బాధితురాలి తల్లి లావణ్య అదే రోజు కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. అయితే ఇదేకాలనీకి చెందిన సరితను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. ఈమేరకు బంగారు గొలుసును అపహరించినట్లు అంగీకరించడంతో కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు.

డిగ్రీ కళాశాలలో చైన్ స్నాచింగ్

- లైబ్రరీ ఇన్‌చార్జ్‌పై దుండగుడి పిడిగుద్దులు
- రెండు తులాల చైన్ అపహరణ

జనగామ: జనగామ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం చైన్‌స్నాచింగ్ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. భూక్యా ఉపేందర్ కళాశాలలో లైబ్రరీ ఇన్‌చార్జ్, రికార్డు అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. విధులకు హాజరైన ఆయన మొదటి అంతస్తులోని లైబ్రరీ చాంబర్‌కు వెళ్లాడు. రెండు రోజుల నుంచి గమనిస్తున్న యువకుడు.. ఉపేందర్ లైబ్రరీ తాళం తీస్తున్న క్రమంలో వెనక నుంచి వచ్చి పిడిగుద్దుల వర్షం కురిపించారు. అప్పటికే స్వల్ప అనారోగ్యంతో బాధపడుతున్న ఉపేందర్, యువకుడి దాడితో గాయపడి అక్కడే కుప్పకూలిపోయాడు. వెంటనే ఆయన మెడలోని రెండు తులాల బంగారం గొలుసును లాక్కొని వెళ్లిపోతుండగా, ఇద్దరి మధ్య పెనుగులాట చోటుచేసుకుంది. విద్యార్థులు వెళ్లి చూసే సరికి ఉపేందర్ పడిపోయి కనిపించారు. విషయం తెలుసుకుని ఆయనను జిల్లా ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి, వైద్య పరీక్షలు చేయించారు. కళాశాలలో వందలాది మంది స్టాఫ్, సిబ్బంది, విద్యార్థులు ఉండగా, గుర్తు తెలియని వ్యక్తి రిజిస్టర్‌లో సంతకం చేసి లోనికి రావడం, ఉద్యోగి మెడలో గొలుసు అపహరించడంపై యాజమాన్యం నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. సీసీ కెమెరాలు పూర్తిస్థాయిలో పని చేయడం లేదు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కళాశాల ఎదుట ఉన్న సీసీ పుటేజీ ఆధారంగా సదరు యువకుడు ద్విచక్రవాహనంపై వెనకాల బ్లాక్ కలర్ షర్ట్ వేసుకుని మరో వ్యక్తితో కలిసి వెళ్తున్నట్లు గుర్తించారు. యువకుడి ఆచూకీ తెలిపిన వారు జనగామ పోలీస్ స్టేషన్ సీఐ–87126 85202, ఎస్సై –8712685259 నంబర్లకు సమాచారం అందించాలని సీఐ దామోదర్‌రెడ్డి తెలిపారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఉపేందర్



బైక్‌పై వెనక కూర్చుని వెళ్తున్న అనుమానితుడు

తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రత్యేక గుర్తింపు

- సీపీఐ జాతీయ నాయకుడు నారాయణ

పాలకుర్తి టౌన్ : తెలంగాణ సాయుధ పోరాటానికి ప్రపంచంలోనే ప్రత్యేక గుర్తింపు ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా నల్ల నర్సింహులు విగ్రహాన్ని మంగళవారం నారాయణ ఆవిష్కరించి, మాట్లాడారు. వచ్చే రెండేళ్లలో నల్ల నర్సింహులు శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలన్నారు. దేశంలో జమిలి ఎన్నికను వ్యతిరేకించేందుకు ఇండియా కూటమి తో కలిసి వామపక్ష పార్టీలు పని చేస్తాయని తెలిపారు. దేశంలో బీజేపీ ప్రభావం తగ్గుతుందని అభిప్రాయపడ్డారు. ఎవరు పార్టీ మారినా రాజీనామా చేసి వెళ్లాలన్నారు. మాజీ మంత్రి దయాకర్‌రావు మాట్లాడుతూ నల్ల నర్సింహులు, కొండా లక్ష్మణ్‌బాపూజీ విగ్రహాల ఏర్పాటుకు కృషి చేస్తాన్నారు. సీనియర్ జర్నలిస్టు పాశం యాదగిరి మాట్లాడు తూ.. నల్ల నర్సింహులు, నంద్యాల శ్రీనివాస్‌రెడ్డిలకు ఉరి శిక్ష వేసింది ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అని గుర్తు చేశారు. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను నల్ల నర్సింహులు, పుచ్చలపల్లి సుందరయ్య లాంటి వారు రాశారని తెలిపారు. తెలంగాణసాయుధ పోరాట చరిత్ర కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు ఏం తెలుసునని ప్రశ్నించారు. కార్యక్రమానికి సభాధ్యక్షుడిగా మాచర్ల సారయ్య వ్యవహరించగా.. నల్ల నర్సింహులు కూతురు అరుణ, మాజీ ఎమ్మెల్యేలు రాజారెడ్డి, వన్నాల శ్రీరాములు, నాయకులు జనార్ధన్, రాజ్‌కుమార్, అబ్బాస్, రమేశ్, మంజల, సాంబయ్య, సుధాకర్, సుధాకర్, భార్గవ్, సుదర్శన్, కృపాకర్, పుల్లయ్య, ధనుంజయ్య పాల్గొన్నారు.



నర్సింహులు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణ, తదితరులు

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

FINANCIAL SERVICES

- సిరి అసోసియేట్స్: హౌసింగ్, మార్టిగేజ్, బిజినెస్, పర్సనల్, ఓపెన్ ప్లాటు, రేకుల ఇల్లు, గూన పెంక ఇల్లు, సిబిల్ లేకున్న రుణాలు ఇప్పించబడును. సంప్ర॥ 9440863470. [W-1264010]

WANTED

- హన్మకొండ, వరంగల్ లోకల్‌లో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ మరియు సూపర్‌వైజర్స్ అర్జెంటుగా కావలెను. జీతం: 12000–14000. సంప్ర॥ 9440414616. [W-1237361]
- మా అపార్ట్‌మెంట్‌లో, షాపింగ్ మాల్స్, ఆఫీస్‌లో పనిచేయుటకు సూపర్‌వైజర్స్, వాచ్‌మెన్స్, సెక్యూరిటీ గార్డ్స్, స్లీపర్స్ అర్జెంటుగా స్త్రీ, పురుషులు కావలెను. సంప్ర॥ 9491710857, 7382106287. [W-1264007]
- ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Q: 10th- డిగ్రీ, Sal: 20K-30K. మీ అడ్రస్ వాట్సాప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692. [W-1239939]
- మా ఆఫీస్‌లో పనిచేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Age: 18 to 45. Contact: 9491706517, 7382323126. [W-1264008]
- ఒమేగా హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను పిల్లలను చూసుటకు వర్కర్స్ / నర్సులు కావలి. ఫ్రీ వసతి, ఫుడ్ జీ : 20K. Ph: 8977639662, 8977639663 [SCA24000542]

తాజా వార్తల కోసం లాగిన్ అవ్వండి www.sakshi.com

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ	9010144453
వరంగల్	9705748198
నర్సంపేట	9553955722
జనగామ	9951602871
మహబూబాబాద్	9010144453
పరకాల	9010299096
జయశంకర్ భూపాలపల్లి	9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.